శివయ్య సేవకు వేళాయే!

- మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- ముస్తాబైన శైవక్షేత్రాలు
- సర్వత్రా భక్తిభావం



నూజివీడు డీఏఆర్ కళాశాల పక్కన ఉన్న కోట శివాలయం



విద్యుద్దీపాల వెలుగులో సి.గుడిపాడులోని శివాలయం

నూజివీడు: తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజక వర్గాల్లో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో శైవక్షేత్రాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులకోసం సౌకర్యాలను అధికారులు పూర్తి చేశారు. శివరాత్రి సందర్భంగా నూజివీడు పట్టణంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. డీఏఆర్ కళాశాల పక్కన ఉన్న కోట శివాలయం పురాతనమైనది కావడంతో దీనికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈనెల 26న తెల్లవారుజామున 3 గంటలకు తొలి మహారుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం సాయంత్రం 7 గంటలకు శివ కల్యాణం నిర్వహించనున్నారు. ఆలయానికి రంగుల విద్యుద్దీపాలు అలంకరించి ముస్తాబు చేశారు. ఈనెల 27న దుర్గామల్లేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు డీఏఆర్ కళాశాల ఆవరణలో అన్నదానం నిర్వహిస్తారు. బస్టాండు సమీపంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. ఆలయానికి విద్యుద్దీపాలంకరణ చేయడంతో పాటు రంగులు వేశారు. 150 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ శివాలయంలో శివరాత్రి రోజున తెల్లవారుజామున 4.30 గంటల నుంచి రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు రాయభారోత్సవం అనంతరం స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అన్నవరంలో వేంచేసియున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, శివసహస్ర నామార్చన, నాగదేవత అష్టోత్తరం, సుబ్రహ్మణ్య సహస్రనామార్చన నిర్వహించనున్నట్లు అర్చకులు భావరాజు పుల్లారావు తెలిపారు.

చాట్రాయి: మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని మండలంలోని శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా చాట్రాయిలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి వేల మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో బారికేడ్లు, తాగునీరు ఏర్పాటు చేశారు. భక్తులు స్నానమాచరించేందుకు ఎదురుగా ఉన్న పెద్ద చెరువులో పుష్కలంగా నీరు ఉంది. సి.గుడిపాడులోని నాగ లింగేశ్వరస్వామి ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. మండలంలోని గ్రామాలతో పాటు ఖమ్మం జిల్లా సరిహద్దు మండలాల నుంచి వేలాది మంది తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాటు పూర్తి చేశామని, రెండు వేల మందికి అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేశామని కమిటీ సభ్యులు మందపాటి రఘుపతిరెడ్డి, అల్లు సత్యనారాయణరెడ్డి, దేశిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.

పవిత్ర సంగమం.. పుణ్యస్నానాలకు సిద్ధం

ఇబ్రహీంపట్నం: పవిత్ర సంగమం వద్ద భక్తులు మహాశివరాత్రి పుణ్యస్నానాలు ఆచరించేందుకు కొండపల్లి మున్సిపాల్టీ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. స్నాన ఘాట్ల వద్ద పరిశుభ్ర వాతావరణం కల్పించారు. రెండు రోజులుగా ఘాట్ల వద్ద చేపట్టిన ఏర్పాట్లు మంగళవారంతో పూర్తి చేశారు. ఘాట్లలో పేరుకుపోయిన నాచుతో భక్తుల కాళ్లు జారకుండా ఇసుక చల్లించారు. మహిళలు తడి దుస్తులు మార్చుకునేందుకు, పితృదేవతల పిండ ప్రదానాలు, వైద్య సేవలకు ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు కార్మికులకు విధులు కేటాయించారు. నదివైపు పడవల ద్వారా గజ ఈతగాళ్లను నియమించారు. మైలవరం నియోజకవర్గం పరిధితో పాటు పొరుగు మండలాల నుంచి సుమారు లక్ష నుంచి 1.20 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలకు తరలివస్తారనే అంచనా ఉందని మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన వెల్లడించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతామని ఆమె తెలిపారు.



శోభనాచలుని కొండపై మల్లికార్జున స్వామి

స్నానఘాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: పవిత్రసంగమం వద్ద భక్తుల పుణ్యస్నానాలకు చేసిన ఏర్పాట్లను ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. బారికేడ్ల లోపల భక్తులు పుణ్య స్నానాలుఆచరించేలా చూడాలన్నారు. ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

వెల్వడంలో ఏర్పాట్లు పూర్తి

మైలవరం: మండలంలోని వెల్వడం గ్రామంలోని శ్రీ బాల కోటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పండుగకు సర్వం సిద్ధం చేసినట్లు శ్రీబాలకోటేశ్వర యువజన కమిటీ తెలిపింది. వెల్వడంలో మంగళవారం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా జరిగే మహాశివరాత్రికి ఈ ఏడాది కూడా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. ఈ ఏడాది మరింత మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్య కలుగకుండా శ్రీ బాలకోటేశ్వర యువజన కమిటీ సభ్యులు చూస్తారని, ఏదైనా ఇబ్బంది ఉంటే కమిటీ సభ్యుల దృష్టికి తీసుకురావాల్సిందిగా తెలిపారు. ముందు జాగ్రత్తగా పోలీస్ సిబ్బంది సహాయం కూడా తీసుకోవడం జరిగిందని కమిటీ తెలిపింది.

ఆగిరిపల్లి: మహాశివరాత్రికి శివాలయాలను ముస్తాబు చేశారు. రంగుల విద్యుద్దీపాలతో ఆలయాలను అలంకరించారు. శోభనాచలుని ఎగువ కొండపై దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి ఆలయం, స్థానిక సత్రం సెంటర్లోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం, వరాహ పుష్కరిణి వద్ద ముక్తేశ్వరస్వామి ఆలయం, ఈదులగూడెంలోని నాగేశ్వర స్వామి ఆలయం, సురవరంలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, కనసానపల్లిలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాలను శివరాత్రి వేడుకలకు ముస్తాబు చేశారు.

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకల ఏర్పాట్లను అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ప్రసాదరావు, తిరువూరు సీఐ గిరిబాబులు మంగళవారం పరిశీలించారు. శివరాత్రి నాడు పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవంతో పాటు తిరునాళ్ళకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పరిశీలించారు. విస్సన్నపేట తహసీల్దారు లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో చిన రాట్నాలు కూడా కొండపర్వ దేవాలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించారు.

గొల్లపూడి ఘాట్‌లో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గొల్లపూడితోపాటు సూరాయపాలెం పుష్కర ఘాట్లలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు, పిండ ప్రదానం చేసేందుకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉచిత మెడికల్ క్యాంప్, తాగునీటి సౌకర్యం, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్ల ఏర్పాట్లు చేస్తున్నారు. గొల్లపూడి పంచాయతీ ఈవో స్వరూపరాణి, స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీ ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

క్లుప్తంగా

ఎన్టీటీపీఎస్ వంద రోజుల వేడుక

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ నాలుగో యూనిట్ నిరంతరాయంగా వందరోజుల పాటు విద్యుత్ ఉత్పత్తి సాధించిన నేపథ్యంలో అధికారులు శతదినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. డీఈఈ గోగినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంస్థ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు కేక్‌కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ నాలుగో యూనిట్‌లో ఇప్పటికి 24వ సారి వందరోజుల వేడుకలు జరుపుకోవడం సంస్థకు గర్వకారణం అన్నారు. సంస్థ పురోభివృద్ధిలో అధికారులు, ఉద్యోగులు కార్మికుల కృషి మరువలేనిదని తెలియజేశారు. సంస్థకు విజయాలు అందిస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎస్ఈలు తిరుమల ప్రసాద్, వెంకటరావు, ఈఈ సురేష్‌కుమార్, వెంకయ్య, గుప్తా, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధ్యం



మైలవరం: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తిరువూరు శ్రీ వాహినీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ చెట్లూరి సోమేశ్వరరావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాథమెటిక్స్ విభాగాధిపతి కే హరిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీపురం శెట్టి రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథి ఉపన్యాసకులు చెట్లూరి సోమేశ్వరరావు మాట్లాడుతూ మాథ్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల మొదటి డిగ్రీలో అవకలనీయ సమీకరణాల గురించి విశదీకరించారు. విద్యార్థుల సందేహాలను వారితో చర్చించారు. విద్యార్థులు తమ సందేహాలను అధ్యాపకులతో నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు సోమేశ్వరరావును సత్కరించారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

మైలవరం: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు డివిజన్ రెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎమ్మెల్సీ ఎన్నికలకు కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లను రెడ్డిగూడెం తహసీల్దారు జే.సుశీలాదేవి మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు కేటాయించిన 67, 68 నంబరు పోలింగ్ స్టేషన్‌లను సందర్శించి వసతులను పరిశీలించారు. మండల రెవెన్యూ అధికారి గంధం పుల్లయ్య, వీఆర్ఓ ఎస్‌కే జానీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



నూజివీడు: విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పట్టుదలతో విద్యార్థులు ముందుకు సాగాలని ఎంఈఓ- 2 జమలయ్య పేర్కొన్నారు. పట్టణంలోని త్రివిధ స్కూల్ 15వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జమలయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను, కమ్యూనికేషన్ స్కిల్స్ అలవర్చుకోవాలన్నారు. అకడమిక్, క్రీడా అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞాన జ్యోతి శిక్షణ

ముసునూరు: ఆరు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిసినట్లు ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సునీల అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం శిక్షణ సర్టిఫికెట్లను 54 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు బెనర్జీ, దుర్గాప్రసాద్, వరప్రసాద్, సీఆర్పీలు దాసు, మోహన్ పాల్గొన్నారు.

స్పెల్ బీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలోని లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూలు పాఠశాల విద్యార్థి జే కార్తీక్ శ్రీనివాస్ విజయవాడలో టీమ్‌విభా నిర్వహించిన స్పెల్ బీ పోటీల్లో 3వ స్థానం సాధించాడు. 4వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థికి ఎన్టీఆర్ జిల్లా ఏఎంవో అశోక్ బహుమతి అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.హరికృష్ణ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఏ సత్యనారాయణ విద్యార్థిని అభినందించారు.

ఎమ్మెల్సీగా నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పాత్ర పోషించాం

మైలవరం: పీడీఎఫ్ బలపర్చిన అభ్యర్థులు ఎమ్మెల్సీలుగా ఎన్నికై శాసన మండలిలో నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పాత్ర పోషించినట్లు పీడీఎఫ్ బలపర్చిన అభ్యర్థి, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు తెలిపారు. మైలవరం విశ్రాంత ఉద్యోగుల భవనంలో మంగళవారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 2007లో శాసన మండలి తిరిగి పునరావృతమైన తర్వాత కూడా మండలిలో తమ వాణి వినిపించామన్నారు. కార్మికులు, కర్షకుల పోరాటాలలో భాగస్వాములమై ప్రభుత్వానికి తమ సలహాలు, సూచనలు ఇచ్చామన్నారు. మళ్లీ తమకు మండలిలో అవకాశం కల్పిస్తే పట్టభద్రుల వాయిస్ వినిపిస్తామని, అవసరమైతే గట్టిగా పోరాడేందుకు కూడా సిద్ధమని హామీనిచ్చారు. ఈ నెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాల్సిందిగా కోరారు. ముందుగా మైలవరంలోని ప్రైవేట్ పాఠశాలలు సందర్శించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, మైలవరం ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు సుడిగాలి పర్యటన

ఇబ్రహీంపట్నం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కేఎస్ లక్ష్మణరావు ప్రచారం ముగింపు రోజు మంగళవారం ఉదయం ఇబ్రహీంపట్నంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం, సీఐటీయూ, వివిధ ప్రజాసంఘాల నాయకులు రింగ్‌సెంటర్‌లో ఆయనకు ఘనస్వాగతం పలికారు. నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలతో పాటు ఇతర విద్యా సంస్థలు, ప్రైవేట్ సంస్థల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కూటమి నాయకులు తనపై దుష్ప్రచారం చేయడంపై స్పందించారు. కూటమి అభ్యర్థి అవినీతి చిట్టా విప్పితే వారు తట్టుకోలేరని స్పష్టం చేశారు. అయినా గెలుపు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఇబ్రహీంపట్నంలో ప్రచారం చేస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు, తదితరులు

25 లీటర్ల సారా స్వాధీనం

నూజివీడు: ఎక్సైజ్ అధికారులు మంగళవారం పలు చోట్ల నిర్వహించిన దాడుల్లో 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పోతురెడ్డిపల్లిలో ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం నిర్వహించిన దాడుల్లో 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు అసిస్టెంట్ ఈఎస్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. గ్రామానికి చెందిన రెడ్డి కౌసల్య వద్ద నిల్వ ఉంచిన 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఆమెను అదుపులోకి తీసుకున్నామన్నారు. కౌసల్యకు సారా సరఫరా చేసిన అజ్మీర విజయ్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవీఎస్ఎస్ ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ, సారా తయారీ, విక్రయం, సరఫరాపై నిఘా ఉంచామని, నల్లబెల్లం విక్రయించిన వారితోపాటు, బెల్లపు ఊట కలిగి ఉన్న స్థలం యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారీ, విక్రయం, సరఫరాపై 94409 02462 నంబరుకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఐదు లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: సారా అమ్మకాలపై దాడులు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడిస్తూ మండలంలోని జనార్ధనవరానికి చెందిన బెజవాడ శ్రీనివాసరావు ఇంట్లో సారా విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, శ్రీ నివాసరావుపై కేసు నమోదు చేశామని చెప్పారు.

శివరాత్రి ఉత్సవాల్లో మద్యం నిషేధం

ముసునూరు: బలివే మహాశివరాత్రి ఉత్సవాల్లో మద్యం, కల్లు విక్రయాలు నిషేధించినట్లు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య చెప్పారు. ఎక్సైజ్ శాఖ నూజివీడు సర్కిల్ టీమ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గస్తీలో ఐదు లీటర్ల నాటుసారా పట్టుకుని, స్వాధీనం చేసుకున్నామన్నారు. ఘటనా స్థలం నుంచి పారిపోయిన విక్రయదారుడు నాయుడు కిషోర్ కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఉత్సవ పరిసరాల్లో సారా, మద్యం, కల్లు విక్రయిస్తే 99495 39933 నంబరుకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

నున్న(విజయవాడరూరల్): గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి, చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలకు చెత్తను తరలించాలని విజయవాడ రూరల్ మండల ఈఓఆర్డీ ఎండీపీ ప్రసాద్ అన్నారు. నున్న గ్రామంలో విజయవాడ రూరల్, జి.కొండూరు, విసన్నపేట మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు, గ్రేడ్ 5 కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు చెత్త నుంచి సంపద సృష్టించడంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈఓఆర్డీ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా చెత్త డంపింగ్ కేంద్రాలు పని చేయాలన్నారు. క్లాప్ మిత్రలు ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేసి కేంద్రాలకు తరలించాలని తర్వాత వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదాయం సమకూరుతుందని చెప్పారు.

సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు

రూరల్ ఎంపీడీఓ(ఎఫ్ఏసి) పి.మురళీకృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ త్రికరణ శుద్ధిగా జరగాలన్నారు. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త వేసే బుట్టలను పంపిణీ చేశామని, వాటిని ఉపయోగించి వేర్వేరుగా చెత్త సేకరించి, వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు.

స్వర్ణాంధ్ర సాధన కోసం అందరూ కలిసి సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని జి.కొండూరు మండల ఈఓఆర్డీ కె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలి



మైలవరం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి, ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని డీఎల్‌పీఓ రాఘవన్ తెలిపారు. మైలవరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ప్రాంగణంలో మైలవరం, రెడ్డిగూడెం, ఏ.కొండూరు మండలాల పంచాయతీ అధికారులు, సిబ్బందికి స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామాలలోని వీధుల్లో చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేసి దాని నుంచి ఎరువులు తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎరువుల అమ్మకం ద్వారా పంచాయతీకి ఆదాయం కూడా వస్తుందన్నారు. కార్యక్రమంలో మైలవరం, రెడ్డిగూడెం, ఎ.కొండూరు మండలాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

జూపూడి(ఇబ్రహీంపట్నం): గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగుకు నిరంతరం కృషిచేస్తున్న కార్మికుల సేవలు వెలకట్టలేనివని డీఎల్‌పీవో రామన్ తెలిపారు. నందిగామ, చందర్లపాడు, ఇబ్రహీంపట్నం మండలాల పారిశుద్ధ్య కార్మికులకు తడి పొడి చెత్త సేకరణ, వర్మికంపోస్ట్ తయారీపై జూపూడి గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తడిపొడి చెత్త ఇళ్ల వద్ద సేకరించే సమయంలో వేరుచేయాలన్నారు. ఘన ద్రవ వ్యర్థాలను పిట్‌లలో వేసి వర్మికంపోస్ట్ తయారీకి వినియోగించాలన్నారు. ఈవో పీఆర్డీ మనోజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వైఎస్ భాగ్యలక్ష్మి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

తిరువూరు: ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్, భారత విద్యార్థి ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞా వికాస్ టాలెంట్ టెస్టు విజేతలకు మంగళవారం తిరువూరు ఎంఈవో శ్యాంసుందర్ బహుమతి ప్రదానం చేశారు. త్వరలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ పరీక్ష ఎంతో ఉపయోగపడుతుందని ఎంఈవో పేర్కొన్నారు. యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు భరతకుమారి, మోహనకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఐతో అద్భుతాలు సృష్టించొచ్చు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అద్భుతాలు సృష్టించ వచ్చని గుంటూరు వీవీఐటీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్కే వసీం అక్రమ్ తెలిపారు. కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్, డీఎస్ విభాగాల ఆధ్వర్యంలో సోమ, మంగళవారం జరిగిన డీప్ లెర్నింగ్, బిగ్‌డేటా అనాలసిస్ వర్క్‌షాపులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంజినీరింగ్ విద్యార్థులు భవిష్యత్తుకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో మెలకువలు నేర్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య మాట్లాడుతూ టెక్నాలజీ ద్వారా చెడు కాకుండా మంచిని స్వీకరించాలని సూచించారు. విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. వివిధ శాఖల విభాగాధిపతులు షేక్ షాబజ్, కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సాయిరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మైలవరం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మైలవరం శివారులో మంగళవారం జరిగింది. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన కుప్పాల వెంకటేశ్వరరావు తన ద్విచక్రవాహనంపై మైలవరం వైపు వస్తున్నాడు. మండలంలోని చంద్రగూడెం వద్ద వెనుక నుంచి వచ్చిన డిజైర్ కారు ఢీకొంది. ఈ సంఘటనలో కుప్పాల వెంకటేశ్వరరావు గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. గాయపడిన వృద్ధుడిని వైద్య చికిత్స కోసం మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని ఏఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలు శారీరక మానసిక ఆరోగ్యాలపై ప్రభావం చూపతాయని ఆయన తెలిపారు. బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తుకు బానిసైన వారిని నూజివీడులోని బోస్కో డీఎడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందించవచ్చన్నారు. వివరాలకు 94904 92020 నంబర్‌లో సంప్రదించాలన్నారు. జోనల్ కోఆర్డినేటర్ ప్రియాంక, హెచ్‌ఎం సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు చట్ట వ్యతిరేకం

జడ్జి అట్లూరి సింధూర



తిరువూరు: బాలలపై లైంగిక వేధింపులు చట్ట విరుద్ధమని, ఇందుకు కఠిన శిక్షలు ఉన్నాయని తిరువూరు అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అట్లూరి సింధూర తెలిపారు. మంగళవారం గంపలగూడెం మండలం పెదకొమెరలోని ఏపీ మోడల్ స్కూల్లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. 2012లో భారత ప్రభుత్వం పిల్లల లైంగిక వేధింపుల నుంచి రక్షణ చట్టాన్నితీసుకువచ్చిందన్నారు. పిల్లలపై ఇంట్లో ఆన్‌లైన్‌లోను లైంగిక వేధింపులకు పాల్పడినా, అసభ్యంగా తాకినా, లైంగిక దాడిగా పరిగణించబడుతుందని జడ్జి వివరించారు. బార్ అసోసియేషన్ చైర్మన్ వాకదాని లక్ష్మీనారాయణ, న్యాయవాదులు చింతల వెంకటరెడ్డి, రాజవరపు శ్రీనివాసరావు, గోగిరెడ్డి కృష్ణారెడ్డి, ఏజీపీ మాలావత్ రాము పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం సర్పంచి రమేష్‌బాబు ప్రారంభించారు. గ్రామీణ యువతలో పోటీతత్వం, క్రీడాస్ఫూర్తి పెంపొందించడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు కొండపర్వ యూత్ నాయకులు తెలిపారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, కుమార్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ కుమార్, గ్రామ ప్రముఖులు రాంబాబు పాల్గొన్నారు.